ప్రజాశక్తి

ఆదివారం 11 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పరిహారంపై పరాచకాలు

◆ అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణపై దాపరికం ◆ గడువు దాటింపుతో రద్దయిన నోటిఫికేషన్

◆ టిడిఆర్‌లకు లేని అనుమతులు ◆ ప్రతిపాదన కోసమే సదస్సులు ◆ పరిహారమే మేలన్న బాధితులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణ బాధితులతో ప్రభుత్వం, అధికారులు నచ్చినట్లు ఆడుకుంటున్నారు. బాధితుల పక్షాన మాట్లాడాల్సిన ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రభుత్వ పక్షాన వున్నారు. భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి న్యాయం చేయకుండా తాననుకున్నట్లు ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్)కు ఒప్పించడానికి ప్రయత్నిస్తున్నారు. కాలపరిమితిలోపు భూ సేకరణకు సంబంధించి అవార్డు నోటిఫికేషన్ జారీచేయకపోవడంతో చట్ట ప్రకారం ముందు జారీచేసిన నోటిఫికేషన్ రద్దయిన వాస్తవాన్ని దాచిపెడుతున్నారు. భూ సేకరణ బదులు కొత్తగా అల్లిన టిడిఆర్ బాండ్లు కథ చుట్టూ బాధితులను తిప్పుతున్నారు.

రోడ్డు పనుల శంకుస్థాపన శిలాఫలకం వద్ద మంత్రి లోకేష్ (ఫైల్)

అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు విస్తరణకు మునగపాక మండలంలోని నాగులాపల్లి, జెపి.అగ్రహారం, మునగపాక, తిమ్మరాజుపేట, తోటాడ, అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేట, కొండకర్ల, చోడపల్లి, అనకాపల్లి మండలంలోని అనకాపల్లి సౌత్-1లో 42.045 ఎకరాల భూ సేకరణకు ఉమ్మడి విశాఖట్నం జిల్లా కలెక్టర్‌కు 2016లో అనకాపల్లి ఆర్‌అండ్‌బి ఎఇ రిక్విజేషన్ అందజేశారు. అందులో 21.61 ఎకరాల భూ సేకరణ బాధ్యతను అనకాపల్లి ఆర్‌డిఒకు కలెక్టర్ అప్పగించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం కల్పిస్తామని 2020 డిసెంబరు 2న ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేశారు. భూ సేకరణ చట్టం సెక్షన్ 19 (1) కింద న్యాయమైన పరిహారం, పునరావాసం బాధితులు పొందేందుకు 2021 అక్టోబర్ 22న నోటిఫికేషన్ జారీ చేశారు. అవార్డు ఎంక్వయిరీ సమయంలో జిల్లా విభజనకు సంబంధించిన జిఒ 40 విడుదల కావడంతో రైతులు కోరుతున్న ఆమోదయోగ్యమైన పరిహారం చెల్లించే విషయమై చర్చించి నిర్ణయం తీసుకొనే సమయంలేక అవార్డు కాలపరిమితిని పొడిగించాలని ఆర్‌డిఒ కోరిన మేరకు 2022 అక్టోబర్ 22 నుంచి 2023 అక్టోబర్ 21 వరకు పొడిగిస్తూ అప్పటి జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఉత్తర్వులు జారీచేశారు.

రైతులకు ఆమోదయోగ్యమైన పరిహారం చెల్లింపుపై ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) ఆమోదం పొందాలని 2023 నవంబరు 8న ప్రభుత్వం మెమో జారీచేసింది. అయితే కోరిన గడువు 2023 అక్టోబర్ 21లోపు అవార్డు నోటిఫికేషన్ జారీచేయకపోవడంతో గతంలో జారీచేసిన నోటిఫికేషన్ రద్దయింది. భూ సేకరణ చట్టం ప్రకారం కాలపరిమితిలోపు అవార్డు నోటిఫికేషన్ మిగతా 2లో..

సింహాచలం ఇఒగా సుజాత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సింహాచలం దేవస్థానం ఇఒగా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాతను ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలతో నియమించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గత నెల 30న చందనోత్సవం రోజున సింహాచలంలో గోడ కూలి ఏడుగురు మృతిచెందిన నేపథ్యంలో విచారణ జరిపిన ప్రభుత్వం ప్రస్తుత ఇఒ సుబ్బారావుపై కొద్ది రోజుల క్రితం వేటు వేసిన సంగతి తెలిసిందే.

పిఠాపురం కాలనీ పార్కుపై హైకోర్టు స్టేటస్ కో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 22వ వార్డులోని పిఠాపురం కాలనీ పార్కు స్థలంలో దౌర్జన్యంగా కొంత భాగాన్ని జివిఎంసి ధ్వంసం చేసి కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేసేందుకు చేసిన ప్రయత్నాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించిందని పిఠాపురం కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు కె.రమాప్రభ, కార్యదర్శి కె.కోటేశ్వరరావు శనివారం తెలిపారు. పార్క్ మొత్తం స్థలం 1533 చదరపు మీటర్లపై కోర్టు స్టేటస్ కో ఇచ్చిందని, పార్క్ స్థలాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించటం చట్ట వ్యతిరేకమని తేల్చి చెప్పిందని వారు పేర్కొన్నారు. 1978లో అప్పటి వుడా పిఠాపురం కాలనీ లే అవుట్ వేసి మధ్య తరగతి ప్రజలకు అమ్మిందని తెలిపారు. లే అవుట్ నిబంధనల ప్రకారం కాలనీ వాసులకు ఓపెన్ స్పేస్ కింద లే అవుట్‌లో కొంత భాగాన్ని కేటాయించారన్నారు. అందులో కొంత భాగంలో పార్క్ నిర్మాణం జరిగిందన్నారు. కొంత భాగంలో నిబంధనలకు విరుద్ధంగా 1990లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించారన్నారు. పార్క్ నిర్వహణ, మెయింటినెన్స్, డెవలప్మెంట్ మొత్తం 1999 నుంచి పిఠాపురం కాలనీ అసోసియేషన్ నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. జివిఎంసి, అసోసియేషన్ మధ్య అగ్రిమెంట్ కూడా కుదిరిందన్నారు. ఇక్కడ ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్‌ను ఇటీవల కూల్చి కొత్తగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. పాత స్థలానికి పరిమితం కాకుండా రాజకీయ ఒత్తిడితో పార్కులో కొంత భాగాన్ని, అందులో ఉన్న వాకింగ్ ట్రాక్, చెట్లు, మొక్కలు, గ్రీనరీ వంటి వాటిని దౌర్జన్యంగా ధ్వంసం చేశారని తెలిపారు. పిఠాపురం కాలనీ అసోసియేషన్‌తో కనీసం సంప్రదించకుండా జివిఎంసి ఈ చట్ట వ్యతిరేక చర్యకు మిగతా 2లో..

పెంచిన పాల అమ్మకపు ధరను రద్దు చేయాలి : సిపిఎం

▶ వార్త మెయిన్‌లో..

రైల్వే లోకోషెడ్‌లో తనిఖీలు

▶ వార్త 2లో..

గురుకులాల ఇంటర్ ప్రవేశ పరీక్షలో స్టేట్ టాపర్‌గా గీతిక

▶ వార్త 4లో..

మతంతో బిజెపి రాజకీయం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని సిపిఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు. సిపిఐ విశాఖ జిల్లా మహాసభల సందర్భంగా కంచరపాలెం మెట్టు నుంచి పాత ఐటిఐ జంక్షన్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 2014లో ఇచ్చిన హామీలను కూడా నేటి వరకూ అమలు చేయలేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, నల్లధనాన్ని వెలికితీసి ప్రజలకు పంచుతామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల హామీతో అధికారంలోకి వచ్చిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా హామీలను అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి రావడానికి రాజకీయ పార్టీలు ప్రజలను హామీలతో మభ్యపెడుతున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు మిగతా 2లో..

ర్యాలీ అగ్రభాగాన ముప్పాళ్ల, జెవి సత్యనారాయణమూర్తి తదితరులు

కొండలపై వేలాడుతున్న మైనింగ్ కత్తి !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఓడ ఎక్కేదాక ఓడమల్లన్న...ఓడ దిగిపోయాక బోడి మల్లన్న'.. అన్నట్టుగా పాలకుల తీరు ఉంది. విశాఖపట్నంలో భూములు, కొండలపై పాలకుల కళ్లు పడడం, అవి పిండి అయిపోవడానికి అనుమతులిచ్చేయడం పై సామెతను గుర్తుకుతేకమానవు. పర్యావరణాన్ని కాపాడడంలో కొండలదే కీలక పాత్ర. కానీ ఆ కొండలకే పాలకులు టెండర్ వేస్తున్నారు. 2024 ఎన్నికల సభల్లో 'మేం అధికారంలోకి వస్తే గిరిజన ప్రాంతాల్లో మైనింగ్‌కు అనుమతులు ఇవ్వం, గిరిజనుల ఉపాధిని దెబ్బతియ్యం, పర్యావరణాన్ని పచ్చదనాన్ని రక్షిస్తాం' అంటూ పదేపదే పలు సభల్లో వెల్లడించిన టిడిపి అధినేత చంద్రబాబు నేడు గనుల లీజుల్లో ఉల్లం'ఘను'డుగా చరిత్ర పుటలకు ఎక్కారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీలోగల గిరిజన గ్రామం ఇచ్చాపురం సర్వే నెంబరు 37పి దెయ్యాలమెట్ట కొండపై సుమారు 16 ఎకరాల మేర మైనింగ్ తవ్వకాలకు అనుమతులను ఇచ్చేశారు. అగ్నిసుముఖ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఈ టెండరు ఇచ్చారు. 20 ఏళ్లపాటు ఇక్కడ క్వార్ట్‌జైట్‌ను తవ్వుకోడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. 2022లోనే అనుమతులున్నా మూడేళ్లలోపు అటవీ అనుమతులను సదరు

సంస్థ తెచ్చుకోవాల్సి ఉంది. తాజాగా ఇక్కడ తవ్వకాలకు స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో సదరు కాంట్రాక్టరు ముందుకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నాడు. సిపిఎం తొలి నుంచీ గిరిజన ప్రాంతాల్లో, ముఖ్యంగా కొండలపై మైనింగ్ కార్యకలాపాలను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. గతంలో కుసులవాడ పంచాయతీ చిన్నయ్యపాలెం వద్ద మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడింది. ప్రజాభిప్రాయం ద్వారా వెనక్కి తిప్పికొట్టింది. తాజాగా ఇచ్చాపురంలో దెయ్యాలమెట్ట కొండపై తవ్వకాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ కలిసి రావడం, సిపిఎం విశాఖ జిల్లా నేతల బృందం ఆ ప్రాంతంలో పర్యటించడం గిరిజన ప్రజలకు అండగా నిలుస్తున్నాయి.

ఆగని పర్యావరణ విధ్వంసం

క్వార్జ్ తవ్వకాల కోసం గిరిజన ప్రాంతాల్లోని ఖనిజ వనరులను కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలు కేంద్రంలోని బిజెపి పాలనలో సాగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో ఆ పార్టీతో పొత్తుపెట్టుకుని కూటమిలో భాగమైన టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'మైనింగ్' లీజులను ఇష్టారాజ్యంగా ఇవ్వడం కనిపిస్తోంది. ప్రకృతి సిద్ధమైన కొండలు విశాఖలో అందుకు బలౌతున్నాయి. రుషికొండ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పరిహారంపై పరాచకాలు

జారీచేయకపోవడంతో ఆ నోటిఫికేషన్ రద్దయింది. ఈ వాస్తవాన్ని బాధితులకు చెప్పకుండా నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని అధికారులు చెప్పుకుంటూ వచ్చారు. మళ్లీ భూ సేకరణ ప్రక్రియ ఆది నుంచి ప్రారంభిస్తే రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతుందని టిడిఆర్ బాండ్లను తెరమీదకు తెచ్చి భూ సేకరణ నోటిఫికేషన్ రద్దుకుగల కారణాలను బాధితులకు చెప్పకుండా దాచిపెట్టారు.

క్షేత్ర స్థాయిలో జరిగింది ?

క్షేత్రస్థాయిలో భూ సేకరణ ప్రక్రియ పూర్తికాకపోవడంతో టిడిఆర్ బాండ్లుకు బాధితులను అంగీకరింపజేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే విజయ్‌కుమార్, అధికారులు ప్రయత్నించారు. పరిహారం తేల్చకుండానే రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. తమ పార్టీ కార్యకర్తలతో టిడిఆర్‌లకు ఒప్పిస్తే, మిగిలినవారు అనివార్యంగా ఒప్పుకోక తప్పని పరిస్థితి వస్తుందని వారు భావించారు. భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసానికి తప్ప టిడిఆర్‌లకు అంగీకరించబోమని బాధితులు తేల్చిచెప్పారు. టిడిఆర్ బాండ్ల జారీకి అమోదముద్ర వేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహించారు. టిడిఆర్ బాండ్ల జారీ ఎమ్మెల్యే, కలెక్టర్ చేతిలో లేకపోవడంతో విఎంఆర్‌డిఎను రంగంలోకి దించారు. ఆర్అండ్‌బి రహదారిలో టిడిఆర్ బాండ్లు జారీకి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అనుమతి పొందాల్సివుంది. అందుకు ప్రతిపాదనలు పంపేందుకు వ్యక్తిగత ప్రాపర్టీ స్కెచ్‌లు, లబ్ధిదారుల సంఖ్యను నివేదించాలని 2025 మార్చి 19న కలెక్టర్ విజయకృష్ణన్‌ను విఎంఆర్‌డిఎ కమిషనర్ కోరారు. రోడ్డు విస్తరణ బాధితులతో టిడిఆర్ బాండ్లుపై ఏప్రిల్ 3 నుంచి 10 వరకు అనకాపల్లి సౌత్, జెపి అగ్రహారం, నాగులాపల్లి, తోటాడ, మునగపాక, తిమ్మరాజుపేట, హరిపాలెం, అచ్యుతాపురం తిమ్మరాజుపేట, కొండకర్ల, చోడపల్లి, దుప్పితూరులో ఆర్‌డిఒ షేక్ అయిషా, విఎంఆర్‌డిఎ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. అయితే వ్యక్తిగత ప్రాపర్టీ స్కెచ్‌లతో అంగీకారం పొంది అనుమతుల కోసం నివేదించడానికి చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. టిడిఆర్‌ల జారీపై బాధితులను ఒప్పించడానికి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, కలెక్టర్ విజయకృష్ణన్ వేసిన పాచికలు పారకపోవడంతో మళ్లీ ఎలాగైనా ఒప్పించి అనుకున్న టిడిఆర్ కార్యం సాధించాలన్న పట్టుదలతో వారున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కొండలపై వేలాడుతున్న మైనింగ్ కత్తి !

హిల్స్‌లో ఐటి కోసం ఇచ్చే భూములే గాకుండా, కాపులుప్పాడలో పదుల సంఖ్యలో భూములను పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ధారాదత్తం చేసిన సంగతి తెలిసిందే. గిరిజన ప్రాంతాల్లోని కొండలను సైతం వదలడం లేదు. రూ.వేలు, లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపదలను మొరటుగా దోపిడీ చేసుకోడానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తాజాగా లైసెన్సులు, టెండర్లు ఇవ్వడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పర్యావరణ వేత్తల్లో ఆందోళన

మైనింగ్‌తో పర్యావరణ పరిరక్షణలో కీలకమైన జీవ వైవిధ్యానికి నెలవైన అడవుల్లో పచ్చదనం కరిగిపోతోంది. పేలుళ్లు, తవ్వకాలతో పక్షులు, జంతువులు ఆవాసాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. చిరుత పులులు, ఎలుగుబంట్లు తరచూ జనావాసాల్లోకి రావడానికి అడవులు, గుట్టల్లో తవ్వకాలే కారణం. వేసవిలో అకాల వర్షాలు, ఎన్నడూ లేనంతగా తీవ్ర ఎండలు, అస్తవ్యస్తంగా రుతుపవనాల విస్తరణ వంటి అనూహ్య మార్పులకు జీవావరణం లోనవుతుందంటూ పలువురు పర్యావరణ వేత్తలు ఈ కొండలపై తవ్వకాల గురించి ఆందోళన చెందుతున్నారు.

మతంతో బిజెపి రాజకీయం

ప్రయాణాన్ని అమలు చేయలేదన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు సమకూరుస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో పేదలు తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు అందిస్తే సచివాలయాల కార్యదర్శుల ద్వారా తెలుగుదేశం నేతలు దరఖాస్తుదారులను బెదిరించారని తెలిపారు. గత ఎన్నికల్లో సొంతంగా 420 స్థానాలు సాధిస్తామని చెప్పిన బిజెపి అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన సీట్లు కూడా గెలవలేక బొర్లా పడిందని విమర్శించారు. ప్రజలను ఎల్లకాలం మభ్యపట్టలేరని అన్నారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలన్న కేంద్రం ప్రయత్నాలను ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం అడ్డుకుందని తెలిపారు. ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో గవర్నర్ల వ్యవస్థ సమైక్య స్ఫూర్తిని కాపాడేదిగా లేదని దుయ్యబట్టారు. నెల రోజుల క్రితం రిజిస్టర్ అయిన సంస్థకు విశాఖలో ఎకరా 99 పైసలకు భూములు కేటాయించారని అన్నారు. మరోపక్క విశాఖలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి మాత్రం ప్రభుత్వానికి భూములు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, జిల్లా నాయకులు ఎజె.స్టాలిన్, సిహెచ్.రాఘవేంద్రరావు, డి.ఆదినారాయణ, పి.చంద్రశేఖర్, ఎ.విమల, దుర్గా భవాని పాల్గొన్నారు.

పిఠాపురం కాలనీ పార్కుపై హైకోర్టు స్టేటస్ కో

పాల్పడిందన్నారు. పార్కులో ఉన్న కల్చరల్ కళా వేదికను కూడా బుల్డోజర్‌తో కూల్చి వేయటానికి ప్రయత్నం చేశారని, కాలనీ అసోసియేషన్ అడ్డుకొని మేయర్‌కు ఫిర్యాదు చేసిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఈ దౌర్జన్య చర్యలపై సీరియస్‌గా స్పందించాలన్నారు. ఈ క్రమంలోనే పిఠాపురం కాలనీ అసోసియేషన్ ఈ విధ్వంసంపై హైకోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. కోర్టు 9వ తేదీన విచారణ జరిపి పార్క్ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించవద్దని పేర్కొందన్నారు. ఇప్పటికైనా జివిఎంసి రాజకీయ ఒత్తిడికి తలొగ్గకుండా కాలనీ పార్కును కాపాడాలని, పౌరులపై దౌర్జన్యం ఆపాలని అధికారులను కోరారు.

రైల్వే లోకోషెడ్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం ఉదయం విశాఖపట్నంలోని విద్యుత్ లోకో షెడ్, రికార్డింగ్ యూనిట్లను, సిబ్బంది పనితీరును, వివిధ నిర్వహణా సౌకర్యాలను తనిఖీ చేశారు. అక్కడి సిబ్బంది, సాంకేతిక నిపుణులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఈస్ట్ కోస్ట్ రైల్వే సహాయక మోటార్ విభాగం, వీల్స్ మాడ్యుల్ షాప్, ట్రాక్షన్ కన్వర్టర్, పవర్ మాడ్యుల్ మరమ్మతులు, పరీక్షా విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విస్తరణ పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వాల్తేరు డిఆర్ఎం లలిత్ బోహ్రా, ప్రధాన విద్యుత్ ఇంజినీర్ ఆలోసాహయ్, ముఖ్య పరిపాలనా అధికారి అంకుష్ గుప్తా, సీనియర్ విద్యుత్ ఇంజినీర్ (ఇఎల్ఎస్) బి.షణ్ముకరావు ఉన్నారు.

లోకోషెడ్‌ను పరిశీలిస్తున్న జిఎం పరమేశ్వర్ ఫంక్వాల్

బివిఆర్ ట్రస్ట్ ద్వారా సేవలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: తన తండ్రి బి.వి.రామారావు ఆశయ సాధన లక్ష్యంగా బి.విఆర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించనున్నట్లు తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలిపారు. శనివారం ఒక హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడు, సమైఖ్య ఆంధ్రప్రదేశ్‌కు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన నందమూరి తారక రామారావు జయంతి రోజున బివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైసిపి దుర్మార్గపు పాలనలో అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు శాసనసభలో మాట్లాడుతూ, ఇది గౌరవసభ కాదు కౌరవసభ అని చెప్పారని, అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా ఒక కౌరవుడు ఉన్నారని, ఆయన ఆయన గాజువాక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అని విమర్శించారు. వైసిపి కోవర్టుగా వ్యవహరిస్తూ గాజువాకలో పల్లా శ్రీనివాసరావు అరాచకాలను సృష్టిస్తున్నారని, ఆయన దురాగతాలపై విచారణ చేపట్టవలసిన అవసరం ఉందని అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి, పార్టీ నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా రామ్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కొల్లి రత్నకుమారి, వేగి రాధాకృష్ణ, డాక్టర్ కె.సురేష్‌బాబు,వి.వంశీబాబు, కె.పరమేష్, పీతల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామ్

అంధుల పెళ్లికి సాయం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ప్రేమసమాజంలో ఈనెల 11న అంధులైన శివజ్యోతి, రాఘవేంద్ర వివాహానికి తాను అన్ని విధాల సహకారం అందిస్తానని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. శనివారం ప్రేమ సమాజంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పెళ్లి కుమార్తెకు బంగారు తాళిబొట్టు, పట్టువస్త్రాలు, వెండిమెట్టెలు అందజేశారు. పెళ్లికుమారుడికి పట్టువస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమసమాజం నిర్వహించే కార్యక్రమాలకు తన సహకారం ఉంటుందని తెలిపారు. ప్రేమ సమాజం ఎన్నో సేవాకార్యక్రమాలకు చిరునామాగా నిలిచిందని కొనియాడారు. ముఖ్యఅతిధిగా హాజరైన విశాఖ నగర సిపి డాక్టర్ శంఖబ్రతబాగ్చీ మాట్లాడుతూ డాక్టర్ కందుల నాగరాజు మంచి పనులకు ఎప్పుడూ ముందు ఉంటారని ప్రశంసించారు. ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ద శివాజీ, కార్యదర్శి హరిమోహనరావు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ప్రేమ గణపతిరావు, అప్పలరాజు ఎంవికె గుప్తా, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

పెళ్లి కుమార్తెకు పట్టు వస్త్రాలు అందిస్తున్న నాగరాజు

కాస్మోటాలజీ, న్యూట్రిషన్ కోర్సులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సెంచూరియన్‌విశ్వవిద్యాలయంతో కలిసి స్వస్థ ఇన్స్టిట్యూట్‌లో కాస్మోటాలజీ, న్యూట్రిషన్‌లో పిజి డిప్లొమా కోర్సుల ప్రారంభమయ్యాయని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని స్వస్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అలైడ్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వస్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అలైడ్ సైన్సెస్ నుంచి కాస్మోటాలజీ, పారామెడికల్ సైన్సెస్ లో కీలకమైన కెరీర్ అవకాశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం తో పాటు కాస్మోటాలజీ, డైట్అండ్ న్యూట్రిషన్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులను అందించడానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో ముఖ్యమైన విద్యాసహకారాన్ని ప్రకటించడం లక్ష్యంగా కోర్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, వెల్‌నెస్, సౌందర్యం వంటి అంశాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలుగా కొనసాగుతున్నందున, వత్తిపరంగా శిక్షణ, సర్టిఫైడ్ విద్యార్థులకు అధిక డిమాండ్ ఉందన్నారు. ఆశావహులైన నిపుణులు బలమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న కెరీర్‌లను నిర్మించడంలో సహాయపడటానికి అధికనాణ్యత, ఆచరణాత్మక విద్యను అందించడం లక్ష్యంగా కోర్సులు నేర్పిస్తున్నామన్నారు. అకడమిక్ ఎక్సలెన్స్, అత్యాధునిక పరిశోధనలు, సమగ్ర ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ హెల్త్‌కేర్ సేవల ద్వారా స్థిరమైన ఆరోగ్య పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యమని రాజీవ్ అన్నారు. సంస్థ గుర్తింపు పొందిన సంస్థల నుండి అక్రిడిటేషన్లను కొనసాగిస్తోందన్నారు. దాని ప్రభావాన్ని విస్తరించడానికి విద్యా, ఆరోగ్య సంరక్షణ సంస్థలతో సహకారాన్ని ఏర్పరుస్తుందన్నారు. స్వస్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అలైడ్ సైన్సెస్ మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ హరిత మాట్లాడుతూ స్వస్థ సుచన్, ఆరోగ్య సంరక్షణ, విద్య, పరిశోధనలకు సమగ్ర విధానం ద్వారా సమాజ శ్రేయస్సును పెంపొందించడానికి అంకితమైన సంస్థగా అభివర్ధించారు. స్వస్థ సుచన్ విస్తృతసేవలను వివరిస్తూ టెలిమెడిసిన్ అందిస్తామన్నారు. వ్యక్తి సంరక్షణ, జీవనశైలి రుగ్మత నిర్వహణ కార్యక్రమాల ను అందిస్తామన్నారు. స్వస్థ సుచన్ హెల్త్‌కేర్,యోగా థెరపీ, ఇంటిగ్రేటివ్ మెడిసిన్‌లో సర్టిఫికేట్ డిప్లొమా కోర్సులను కూడా అందిస్తున్నామన్నారు. డాక్టర్ అనంత మాట్లాడుతూ క్లినికల్ కాస్మోటాలజీ, సౌందర్య చికిత్స, అధునాతన హెయిర్ డిజైన్‌లో కోర్సులు పరిశ్రమ అవసరాలను తీరుస్తాయన్నారు.

సెంచూరియన్ విశ్వవిద్యాలయం సహకారం పాఠ్యాంశాల అభివృద్ధి, ఫ్యాకల్టీ మార్పిడి, ఇంటర్న్‌షిప్ అవకాశాలను మెరుగుపరుస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమాలు లాక్మే, ఎల్ ఓరియల్ వంటి అగ్ర బ్రాండ్‌లతో కెరీర్‌లకు విద్యార్థులను సిద్ధం చేస్తాయన్నారు. వివరాలకు 6304326204, 8309159894 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A. NO. 2435/2024 IN O.S. NO. 393/2023

Between :

దక్షిరాజు తిరుపతమ్మ ... పిటీషనరు / వాది

వర్సెస్

మల్లపురాజు శ్రీనివాసరాజు అండ్ అదర్స్ ... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

టు :

R2 : పామరాజు అరుణ, భర్త: సూర్యనారాయణ రాజు, టి.డి.నెం. 1192, విఠగుంట ఎగ్జిబిషన్ గ్రౌండ్, చీమలపల్లి గ్రామం, పెందుర్తి మండలం, విశాఖపట్నం జిల్లా – 530047.

పై నెంబరు దావాలోని వాది పై నెంబరు పిటీషన్‌ను మీపైన మరియు ఇతరులపైన రిజాయిండర్ రిసీవ్ చేసుకొనుటకు పర్మిషన్ కోరుచూ దాఖలు చేయగా అందు మీకు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్డ్ పోస్ట్ ద్వారాను నోటీసులు పంపినను మీరు తీసుకొనని కారణంగా మీకు పై పిటీషన్‌లో నోటీసును ఈ ప్రకటన ద్వారా ఇవ్వవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 19-6-2025కి వాయిదా వేసినారు. సదరు తేదీన మీరు పై కోర్టులో స్వయంగా గాని, మీ ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై పిటీషన్‌ను అనగా ఐ.ఏ. 2435/2024ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వాయిదా : 19-6-2025

పి. తరుణ్‌కుమార్,
వి.కాశీవిశ్వనాథరాజు,
పిటీషనర్ తరపు అడ్వకేట్స్,
తెనాలి.

పనిచేసిన వారికి తగిన గుర్తింపు

సత్యనారాయణను సత్కరిస్తున్న మజ్జి శ్రీను

ప్రజాశక్తి -ఆనందపురం: పార్టీలో పనిచేసిన వారికి ఎపుడూ తగిన గుర్తింపు ఉంటుందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని గండిగుండం గ్రామంలో సర్పంచ్ గనిరెడ్డి శ్రీనివాసరావు నివాసంలో మండల పార్టీ కమిటీ, అనుబంధ విభాగ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీను మాట్లాడుతూ, మంచి నాయకత్వం ఆధ్వర్యంలో నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలే పార్టీకి ముఖ్యమన్నారు. పార్టీ కేడర్ మనోభావాలు, అభీష్టం మేరకే ఎన్నికలను నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయాలలో గెలుపోటములు సహజమని, గత ఎన్నికల్లోనూ, కష్టకాలంలోనూ పార్టీకి పనిచేసిన వారికి ఎపుడూ గుర్తుంచుకుంటామన్నారు. ఈ సందర్భంగా బంక సత్యనారాయణ మాట్లాడుతూ, పదేళ్లగా పార్టీ మండల అధ్యక్షునిగా ఉన్న తనకు మరోసారి ఏకగ్రీవంగా బాధ్యతలుఅప్పగించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, బంటుబిల్లి మణిశంకర్ నాయుడు, బోని అప్పలనాయుడు, పాండ్రంకి అప్పారావు బొట్ట రామకృష్ణ, చందక లక్ష్మీసూరిబాబు, కోరాడ సూర్యారావు, షినగం దామోదరరావు, లంక రాంబాబు, సింహాచలం నాయుడు, బంక శ్రీను, బంక సూర్యనారాయణ, రౌతు శ్రీను పాల్గొన్నారు

నేటి కార్మిక వర్గానికి గున్నారావు స్ఫూర్తి

ప్రజాశక్తి-తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం సిపిఐ సీనియర్ నాయకులు తెడ్లాపు గున్నారావు చేసిన పోరాటాలు మరువలేనివని పలువురు కొనియాడారు.స్థానిక జిఆర్ భవన్‌లో శనివారం గున్నారావు నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ ఏరియా సమితి కార్యదర్శి కాసూరు రాంబాబు మాట్లాడుతూ, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో వ్యవసాయ కార్మికులను ఏకం చేసి ఎన్నో పోరాటాలు నడిపారని గుర్తు చేశారు. అలానే జ్యూట్ కార్మికుల పోరాటాలకు అండగా ఉండేవారని వివరించారు. చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, నాయకులు అప్పలరాజు, అప్పలసూరి, ఆదినారాయణ పాల్గొన్నారు

క్రీడలతో మైత్రీ బంధం

జెర్సీలను ఆవిష్కరిస్తున్న స్థానిక నేతలు

ప్రజాశక్తి -కొమ్మాది : స్నేహ భావాన్ని పెంపొందించేవి క్రీడలేనని టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు అన్నారు. మధురవాడకు చెందిన యువత ప్రతి ఒక్కరూ సామాజిక స్ఫూర్తితో ముందుకు నడవాలని, చెడుమార్గంలో వెళ్లకుండా క్రీడా స్ఫూర్తిని చాటడం శుభపరిణామమని అన్నారు. శనివారం నుంచి సోమవారం వరకు ఒలేటి శ్రవణ్ ఆధ్వర్యంలో నజీర్, ఓం, సురేష్, మహేష్ పర్యవేక్షణలో నిర్వహించే ఎంఎల్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐదోవార్డు అధ్యక్షులు నాగోతి సత్యనారాయణ (జపాన్), వార్డు యువత అధ్యక్షులు కొండపు రాజు, కొర్రాయి సురేష్, రాష్ట్ర కళింగ వెల్ఫేర్ డైరెక్టర్ మామిడి దుర్గారావు, 5వ వార్డు జనసేన అధ్యక్షులు దేవర శివ పాల్గొని, వివిధ జట్ల జెర్సీలను ఆవిష్కరించారు.

కుళాయిల్లో కలుషిత నీరు!

- నెల రోజులు కావస్తున్నా పట్టని అధికారులు
- శ్రీనివాసనగర్ కాలనీ వాసుల అవస్థలు

రంగు మారిన నీటి వాసన చూస్తున్న స్థానిక మహిళ

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు శ్రీనివాస్‌నగర్ కాలనీలోని జివిఎంసి కుళాయిల్లో నెలరోజులుగా మురుగునీరు వస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రంగుమారిన నీరు రావడంతోపాటు దుర్వాసన కొడుతోందని, దీనిపై సంబంధిత నీటిసరఫరా విభాగం జివిఎంసి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నామమాత్రపు చర్యలు చేపడుతున్నారే తప్ప సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం లేదని వారంతా వాపోతున్నారు. దీంతో శ్రీనివాసనగర్‌లోని 70కిపైగా కుటుంబాల నివాసితులు ప్రస్తుత వేసవి సీజన్‌లో నీటికి కటకటలాడిపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. కాలనీలోని కుళాయిల్లో నీరు వస్తున్నప్పటికీ, అది కలుషితంగా ఉండడంతో అలాగే వృథాగా వదిలేసు న్నామని, గత్యంతరం లేని పరిస్థితుల్లో మరోవీధిలోకి వెళ్లి, అక్కడ వారంతా పట్టుకున్నాక తాము నీరు పట్టుకుని తెచ్చుకుంటున్నామని ఆవేదన చెందుతున్నారు. జివిఎంసి కుళాయిల్లో దుర్వాసనతో కూడిన కలుషిత నీరు నెలరోజులకు పైగా వస్తున్నా సమస్య పరిష్కరించడంతో సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై వారంతా మండిపడు తున్నారు. కుళాయి పైపులైన్ మరమ్మతులకు తవ్విన గోతులు పూడ్చకుండా వదిలేయడం, మురుగు కాలువల్లోని నీరు కుళాయి పైపులైన్లలోకి చేరడం వల్లే ఇదంతా జరుగుతోందని శ్రీనివాస నగర్ కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి, జివిఎంసి కుళాయిల్లో మంచినీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టి, ప్రస్తుత వేసవిలో నీటి కష్టాల నుంచివిముక్తి కల్పించాలని స్థానిక మహిళలు వేడుకుంటున్నారు.

కప్పకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన పైపులైన్ గొయ్యి

ఫిర్యాదు చేసినా స్పందన లేదు

కుళాయిల్లో నెలరోజులుగా దుర్వాసనతో కూడిన మురుగు నీరు వస్తోంది. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వెంటనే మరమ్మతులు చేయాలి.

– సంతోష్ కుమారి, శ్రీనివాసనగర్ కాలనీ

నీరు వృథాగా పోతోంది

వంట, తాగడానికి పక్కన పెడితే, వాడకానికి కూడా పనికిరానంతగా జివిఎంసి కుళాయిల్లో కలుషిత నీరు వస్తోంది. నెలరోజులుగా కాలనీ వాసులెవరూ పట్టు కోవడం లేదు. నీరు వృథాగా పోతోంది.

లక్ష్మి, శ్రీనివాసనగర్ కాలనీ

110 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -ఆనందపురం మండలంలోని వెల్లంకి గ్రామంలో సత్య సాయి భజన మండలి విశాఖపట్నం జోన్ సహకారంతో వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు.జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించగా, శంకర్ ఫౌండేషన్ ఆప్తమాలజిస్టులు డాక్టర్ సుముద్రి , డాక్టర్ దేవి పాల్గొని, 110 మంది కంటి రోగులకు వైద్యపరీక్షలు చేశారు. 20మందిని కేటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. తొమ్మిది మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వృక్ష ఫౌండేషన్ కాకర సురేష్ కుమార్, ఎంవి. సత్యసాయి కుమార్,క్యాంప్ కోఆర్డినేటర్ వై.రాజు, కె.తమ్మి నాయుడు, డి.శరత్ కుమార్, ఫౌండేషన్ సభ్యులు సాడి శంకర్, కాకర కిరణ్ పాల్గొన్నారు.

గీతం ఆసుపత్రికి ఎన్ఎబిహెచ్ గుర్తింపు

ప్రజాశక్తి-మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం ఆసుపత్రికి జాతీయ స్థాయిలో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఎబిహెచ్) గుర్తింపు లభించిందని జిమ్సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి వెల్లడించారు. శనివారం జిమ్సర్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ, రుషికొండ సమీపంలోని గీతం ఆసుపత్రిలో అత్యుత్తమ ప్రమాణాలతో వైద్య సేవలు అందించడం, ఆసుపత్రి నిర్వహణ, సామాన్యులకు సహితం వైద్య సేవలను అందేలా ప్రణాళికలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు చెందిన ఎన్ఎబిహెచ్ సర్టిఫికేట్ మంజూరు చేసిందన్నారు. గీతం ఆసుపత్రికి ఎన్ఎబిహెచ్ గుర్తింపు రావడంలో వైద్య నిపుణులు, పారామెడికల్ సిబ్బంది సమిష్టి కృషి ఉందన్నారు. గీతం ఆసుపత్రిని 750 పడకలతో, ఏడు ఐసియు పడకలు, ఇంటెన్సివ్ కేర్‌యూనిట్, 16 మేజర్, మూడు మైనర్ ఆపరేషన్ థియేటర్లతోపాటు అధునాతన డయాలసిస్ యూనిట్, కేథ్‌ల్యాబ్, రేడియాలజీ, పెయిన్‌క్లినిక్‌లతో అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేసామన్నారు. రౌండ్‌దిక్లాక్ అంబులెన్స్ (9491761246) సేవలు అందిస్తూ,ఎన్‌టిఆర్ వైద్య సేవ, ఇఎస్ఐ, ఇహెచ్ఎస్, బిఎస్‌కెవై ద్వారా ప్రజలు వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. సమావేశంలో జిమ్సర్ అక్రిడిటేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణకార్తీక్ భోగవల్లి, జిమ్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వి.నరసింహారావు, ఎన్ఎబిహెచ్ గీతం పర్యవేక్షకురాలు డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహం కాలేదని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కశింకోట : వివాహం కాలేదని ఒడిస్సా రాష్ట్రానికి చెందిన అర్జు పాంగి (25) ఇనుప గొట్టానికి చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... కసింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామం దగ్గరలో ఉన్న అప్సాజీ అసోసియేషన్ బాటిల్ ప్రాసెసింగ్ యూనిట్‌లో ఒరిస్సాకు చెందిన అర్జు పాంగి కూలీగా పని చేస్తున్నాడు. తన అన్న కామూరుపాంగి, తమ్ముడు త్రినాథ్ పాంగి ఇద్దరికి వివాహం జరిగింది. కాని అర్జు పాంకికి వివాహం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపన చెందిన అర్జు మూడు రోజులుగా పనికి వెళ్లకుండా తన రూమ్‌లో ఉండిపోయాడు. మానసికంగా కృంగిపోయిన అర్జు తన గదికి గడి పెట్టుకొని శుక్రవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఉరి వేసుకున్నాడు. శబ్దం రాగా పక్క గదిలో ఉన్న వారు చూసి గ్రామ పెద్దలను తీసుకుని వచ్చి తలుపులు బద్దలుగొట్టి చూడగా ఉరివేసుకొని వేలాడుతున్నాడు. బంధువులు పిర్యాదు మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి-మధురవాడ: పిఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు సిఐ జి బాలకృష్ణ తెలిపారు. వివరాలివి. జివిఎంసి ఐదో వార్డు వైఎస్ఆర్ కాలనీకి చెందిన గంజేటి సూర్యకుమారి (48) బ్లాక్ నం. 19, టైప్-1లో తన కుటుంబ సభ్యులతో నివాసముంటోంది. నగరంలో ఓ ఆసుపత్రి లో విధులు నిర్వహిస్తున్న సూర్యకుమారి, శుక్రవారం రాత్రి విధులు ముగించుకొని తిరిగి వచ్చే క్రమంలో చంద్రంపాలెం వద్ద రోడ్డు దాటుతుండగా, నగరం నుంచి ఆనందపురం వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆమెను కెజిహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మృతి చెందింది. మృతురాలి కుమారుడు బుచ్చిబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : చోడవరం నుండి అనకాపల్లి వైపు ప్రయాణికులతో వస్తున్న ఆటో అనకాపల్లి నుండి చోడవరం వైపు వెళ్తున్న కారు ఢీకొన్నాయి. అనకాపల్లి -చోడవరం రోడ్డు మార్గంలో బవులవాడ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది.

ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న చోడవరం మండలం అంబేరుపురం గ్రామానికి చెందిన ఏడుగురు మహిళల్లో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆళ్ల ముత్యాలమ్మ (51) అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ ప్రయాణికులను స్థానికుల సహాయంతో స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రికి వైద్యానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

అనుమానాస్పద వ్యక్తిపై పోలీసుల అప్రమత్తత

ప్రశ్నిస్తున్న నార్త్‌జోన్ ఎసిపి అప్పలరాజు

ప్రజాశక్తి-మధురవాడ : నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నుంచి అనుమానాస్పదంగా తిరుగుతూ, కొన్ని ప్రాంతాల్లో ఫోటోలు తీస్తున్న వ్యక్తిపై సోషల్ మీడియా ట్రోలింగ్‌లు వస్తున్న నేపథ్యంలో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. కారుషెడ్ వద్ద ఆ వ్యక్తిని పిఎంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకోగా, నార్త్ సబ్ డివిజన్ ఎసిపిఅప్పలరాజు విచారించారు.

అనంతరం ఎసిపి వెల్లడించిన వివరాలు ప్రకారం, ఇండియన్ ఆర్మీలో పనిచేసి, 2023లో రిటైరైన విజయనగరం జిల్లా పక్కి గ్రామానికి చెందిన పెంకి ప్రవీణ్‌కుమార్‌గా గుర్తించారు. కాస్త మతిస్థిమితం లేక తిరుగుతుండగా, ప్రస్తుతం పాక్, భారత్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అతడిని గమనించిన స్థానికులు ఫోటోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టి వైరల్ చేయడంతో పిఎం.పాలెం సిఐ జి.బాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రశ్నించిన తర్వాత, సంబంధిత వ్యక్తి కుటుంబసభ్యులతో సంప్రదించి, ఎటువంటి అనుమానాలు లేవని నిర్ధారించుకున్నాక వారికి అప్పగించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి
రేపు యుటిఎఫ్ ధర్నా

డిఇఒకు ధర్నా నోటీసు అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు, పాఠశాలల పునర్వ్యస్థీకరణ తదితర విషయాలపై ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్‌ను కలిసి ధర్నా నోటీసును అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12న నిర్వహించే జిల్లాస్థాయి ధర్నా కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించని పక్షంలో 15న రాష్ట్ర విద్యాశాక డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సేవాభావం
రైలు పయాణికులకు మంచినీటి బాటిళ్ల పంపిణీ

దువ్వాడ స్టేషన్‌లో మంచినీటి బాటిళ్ల పంపిణీ చేస్తున్న రిటైర్డ్ పర్సన్స్

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొంతమంది స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులంతా పదిరోజులుగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న రైలు ప్రయాణికులకు మంచినీటి బాటిళ్లను అందించి వారి దాహార్తిని తీరుస్తున్నారు. రైల్వే యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి జెడ్ఆర్‌సిసి సభ్యులు కొంచె మూర్తి ఈశ్వర్, మానవ వికాస వేదిక ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్ మూర్తి, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాషువా, మానవ వికాస వేదిక సభ్యులు జివి రావు ఇలా పలువురు రిటైర్డ్ ఉద్యోగులంతా మండుటెండల్లో గొంతెండిపోతున్న రైలు ప్రయాణికులకు మంచినీటి బాటిళ్లన అందించి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ప్రశాంతి, జన్మభూమి, వాస్కోడిగామా వంటి రద్దీగా ఉండే రైళ్లలో జనరల్ భోగిల్లో ఆపసోపాలు పడుతున్న వారికి ప్రతిరోజూ 500 వరకు నీటి బాటిళ్లను అందిస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులంతా తమకు వస్తున్న పెన్షన్ సొమ్ములో కొంత మొత్తాన్ని ఇలా వినియోగిస్తూ సేవాభావాన్ని చాటుకుంటూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.

అంతర్జాతీయ బాక్సర్ ఉషకు సత్కారం

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఇటీవల ఎన్నికైన అంతర్జాతీయ బాక్సర్, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత ఎన్.ఉష శనివారం పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉషను సాదరంగా స్వాగతించిన ఎమ్మెల్యే గణబాబు, ఆమెను ఘనంగా సత్కరించారు.

ఉషను సత్కరిస్తున్న గణబాబు

- అర్హత ఉన్నా సరే.. అందని ఉచితం
- తొలివిడతలో కొందరికే అందిన వైనం
- రెండోసారి అందరికీ మొండిచేయి

ఉచిత్త గ్యాస్

ప్రజాశక్తి - భీమునిపట్నం : సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏటా పేదలకు మూడు వంటగ్యాస్ సిలెండర్లను ఉచితంగా ఇస్తామన్న కూటమి ప్రభుత్వం మాటలు ఆచరణలో అరకొరగానే అమలయ్యాయి. కొందరికి ఉచితమైనా, ఎంతో మందికి 'ఉత్త గ్యాస్' గానే మిగిలిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నికలకు ముందు ప్రతి ఇంటికి ఏటా మూడు వంటగ్యాస్ సిలిండర్ల ను ఉచితంగా ఇస్తామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక 'దీపం - 2 ' కింద దీపావళి కానుకగా తీసుకొచ్చిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అందరికీ కాదనేది తేటతెల్లమైంది. గ్యాస్ బుక్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతాలో రాయితీ మొత్తం పడుతుందనేది భ్రమ అని తేలింది. కూటమి ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన ఉచిత గ్యాస్ పథకంపై క్రమంగా లబ్ధిదారుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయనేది క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడైంది.

గ్యాస్ సిలిండర్లు డెలివరీ అయిన 24 గంటల నుంచి 48 గంటల్లో రాయితీ సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ కాక పోవడంతో జనం ప్రభుత్వంపై మండి పడుతున్నారు.రోజులు గడుస్తున్నా రాయితీ సొమ్ము అందలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. భీమిలి మండలం, పట్టణ పరిధిలో 35, 289 తెల్ల రేషన్ కార్డులున్నాయి. దీపం 2 పథకం కింద 26, 841 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.వీరందరూ ఉచిత గ్యాస్ పథకానికి అర్హులైనా, తొలివిడతలోనే అనేకమందికి ఉచితం అందలేదు.

సర్కారు మెలికలు...తిప్పలు పడుతున్న సామాన్యులు

ఉచిత గ్యాస్ రాయితీ సొమ్ము పొందేందుకు సర్కారు మెలికలు పెడుతుండటంతో సామాన్యులు తిప్పలు పడుతున్నారు. .ఉచిత సిలెండర్ పొందాలంటే రైస్ కార్డు తప్పనిసరి అని మెలిక పెట్టారు. దీంతో మధ్య తరగతి మహిళలు తీవ్ర నిరాశకు గురయ్యారు. తెల్లరేషన్ కార్డు మనుగడలో ఉంటేనే ఈ పథకానికి అర్హులన్నారు. ఇకెవైసి తప్పని సరి చేశారు. మొదటి విడత మార్చినెలాఖరుతో ముగిసింది. అప్పటికే అనేకమందికి ఉచితగ్యాస్ డబ్బులు అందకపోగా, ఏప్రిల్ 1 తర్వాత రెండో విడత గ్యాస్ బుకింగ్ ప్రారంభించి డెలివరీ కూడా చేస్తున్నారు. ఎల్‌పిజి కనెక్షన్, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు తప్పని సరి చేశారు. ఇవన్నీ ఉంటేనే ఈ పథకం అమలు చేస్తున్నారు అన్నీ ఉన్నా సబ్సిడీ మొత్తం తమ బ్యాంక్ ఖాతాల్లో జమ కావడం లేదని పలువురు మహిళలు చెబుతున్నారు.

అన్నీ సక్రమంగా ఉంటేనే...

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్నీ సక్రమంగా ఉంటేనే బ్యాంకు ఖాతాల్లో రాయితీ సొమ్ము జమ అవుతుంది. బ్యాంక్ ఖాతాకు, గ్యాస్ కనెక్షన్‌కు రెండింటికీ ఆధార్ నంబర్ అనుసంధానమై ఉండాలి. ఇకెవైసి తప్పని సరి. రాయితీ సొమ్ము జమ కాకుంటే టోల్ ఫ్రీ నంబర్ 14400కు సంప్రదించ వచ్చు. సమీపంలో ఉన్న సివిల్ సప్లై అధికారులను, గ్యాస్ ఏజెన్సీని సంప్రదించవచ్చు.

-కె.శ్రీనివాసరావు
సివిల్ సప్లై డిటి, భీమునిపట్నం

రాయితీ సొమ్ము జమ కాలేదు

గ్యాస్ బుకింగ్ చేసాక రోజులు గడుస్తున్నా మెసేజ్ రాలేదు. అడిగితే ఇకెవైసి చేయించు కోవాలని ఒక సారి, బ్యాంక్‌లో జమ అయిందేమో చూడండని మరోసారి చెప్పారు. రెండు విడతల్లోనూ ఉచిత రాయితీ సొమ్ము జమకాలేదు.

బి సంధ్య, సంతపేట, జివిఎంసి ఒకటో వార్డు

గ్యాస్‌కు డోకాలేదు.. రాయితీ రాలేదు

బుక్ చేసుకుంటే గ్యాస్ వస్తుంది. ఉచిత రాయితీ డబ్బులు మాత్రం బ్యాంకులో పడడం లేదు. ఎందుకు పడడం లేదో తెలియదు.

-వై మహాలక్ష్మి, వలందపేట, జివిఎంసి రెండో వార్డు

అదిగో, ఇదిగో అంటున్నారు..

గ్యాస్ బుకింగ్ చేసాక డబ్బులు పడడం లేదు. ఎందుకు పడడం లేదని అడిగితే అదిగో ఇదిగో అంటున్నారే తప్ప, ఏం చేయాలో ఎవరూ స్పష్టంగా చెప్పడం లేదు.

- కె ఆదిలక్ష్మి, బంగ్లామెట్ట, జివిఎంసి ఒకటో వార్డు

గురుకులాల ఇంటర్ ప్రవేశ పరీక్షలో
స్టేట్ టాపర్‌గా గీతిక


తల్లిదండ్రులతో స్టేట్ టాపర్ గీతిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి నిర్వహించిన బిఆర్‌జిసిఇటి-2025 ఫలితాల్లో విశాఖ జిల్లా జివిఎంసి ఐదవ వార్డు కొమ్మాదికి చెందిన రఘుపతి గీతిక రాష్ట్రస్థాయిలోనే టాపర్‌గా నిలిచింది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు నగరంలోని బుచ్చిరాజుపాలెం డిఎవి స్కూల్‌లో చదివిన గీతిక, పదో తరగతి వరకు సిబిఎస్ఇ సిలబస్‌తో మధురవాడ బ్రాంచి నారాయణ స్కూల్‌లో చదివింది.టెన్త్ సిబిఎస్ఇ ఫలితాలు ఇంకా విడుదల కాలేదు. కాగా పాఠశాలలో వారాంతపు పరీక్షల్లో ఎపుడూ మొదటి రెండుస్థానాల్లో నిలిచిన గీతిక, గురుకుల ప్రవేశపరీక్షలో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలుస్తుందని ముందుగా ఊహించాలని పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినులు అంటున్నారంటే, ఆమెపై వారికెంత నమ్మకముందో ఇట్టే తెలుస్తోంది. పాలిసెట్ పరీక్షకు హాజరైన నేపథ్యంలో వాటి ఫలితాల్లోనూ రాష్ట్రస్థాయిలోనే ర్యాంకు సాధిస్తుందని వారుంటున్నారు.

గ్రామీణ నేపథ్యం గల కుటుంబం నుంచి...

గ్రామీణ నేపథ్యం గల కుటుంబం నుంచి వచ్చిన గీతిక, మొదటి నుంచి చదువుపై ఏకాగ్రత కలిగి ఉంది. శ్రీకాకుళం జిల్లా, పొందూరు మండలం, కనిమెట్ట గ్రామానికి చెందిన వెంకట రమణ, రాజ్యలక్ష్మి దంపతులు పెద్ద కుమార్తె గీతిక. సాధారణ వ్యవసాయ కుటుంబం వీరిది. ఉపాధి కోసం కొన్నేళ్ల క్రితం విశాఖ నగరానికి వలస వచ్చిన వీరి కుటుంబం ప్రస్తుతం కొమ్మాదిలో నివాసం ఉంటున్నారు. తండ్రి వెంకటరమణ ప్రజాశక్తి ఉద్యోగి. తల్లి రాజ్యలక్ష్మి ఆశా వర్కర్. వీరికి ఇద్దరు కుమార్తెలు.గురుకుల ప్రవేశపరీక్షలోరాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచిన గీతిక పెద్దమ్మాయికాగా, రెండో కుమార్తె పూజశ్రీ.

సివిల్స్ చదువుతా..

సివిల్స్ చదవాలని ఉంది. ఇందు కోసం ప్రయత్నం కొన సాగిస్తాను. ఇంతగా చదవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణం.

- రఘుపతి గీతిక,
బిఆర్‌ఎజిసిఇటి రాష్ట్రస్థాయి టాపర్
కొమ్మాది, విశాఖ జిల్లా

అధిక లోడుతో వెళ్తున్న లారీ సీజ్

ప్రజాశక్తి-కశింకోట : అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీని కసింకోట జంక్షన్ వద్ద సిఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం పట్టుకొని సీజ్ చేశారు. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న ఒక టిప్పర్ తనిఖీ చేయగా రాయి లోడు అధిక బరువుతో ఉండడంతో వెంటనే ఆ వాహనాన్ని సీజ్ చేసి శాఖపరమైన చర్యలకు అనకాపల్లి ఆర్టీవోకు సమాచారం అందించారు. ఆర్టీవో సదరు వాహనంపై రూ.36 వేలు జరిమానా విధించారు.

మోడల్ నియోజకవర్గంగా
గాజువాకను అభివృద్ధి చేస్తా

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక: మోడల్ నియోజకవర్గంగా గాజువాకను అభివృద్ధి చేస్తానని గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శనివారం గాజువాక పార్టీ కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా మాట్లాడుతూ, వైసిపి జగన్ హయాంలో దగా పడిన నవ్యాంధ్రను స్వర్ణాంధ్రప్రదేశ్ వైపు తీసుకువెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తల్లికి వందనం ద్వారా ఈనెలలోనే ప్రతి విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

పార్టీ రాష్ట్ర పరిశీలికుడు ఎంవిఆర్ చౌదరి మాట్లాడుతూ. గాజువాక నియోజకవర్గంలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పారదర్శంగా వార్డు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి ఎండీ రఫీ, సీనియర్ నాయకులు చెరుకూరు నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ స్వర్ణపూడి రాంబాయి, టిఎన్ఎఫ్ఎస్ అధ్యక్షులు సాకే రతన్ పాల్గొన్నారు. అనంతరం వార్డు అధ్యక్షునిగా గోమాడ వాసు, ప్రధాన కార్యదర్శి ఎండీ, మోర్తాజా, క్లస్టర్ ఇన్‌ఛార్జి సత్యనారాయణతో కూడిన నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు.

రాజకీయ అవిశ్వాసాలు

★ మున్సిపల్ వైస్ చైర్మన్లపై కూటమి నేతల అవిశ్వాస నోటీసులు
★ దెబ్బకు దెబ్బ తీసేందుకు చైర్‌పర్సన్ రమాకుమారి వ్యూహాలు
★ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలి మున్సిపాలిటీలో ప్రస్తుతం ప్రజలకు అవసరం లేని రాజకీయ అవిశ్వాసాలు నడుస్తున్నాయి. మరో పది నెలల్లో మున్సిపాలిటీ పదవీ కాలం ముగియనుండగా.. వైసిపి, టిడిపి కూటమి నాయకులు ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటూ రాజకీయ వేడి పుట్టించారు. పార్టీ మారిన మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారిని దెబ్బతీయడానికి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు వేసిన ఎత్తులను చిత్తు చేస్తూ కౌన్సిలర్లను తమవేపు తిప్పుకొని గత నెల 22న జరిగిన అవిశ్వాసం వీగిపోయేలా కూటమి నేతలు చేసిన విషయం తెలిసిందే. ఈ విజయోత్సాహంతో చైర్‌పర్సన్ రమాకుమారి వైసిపిని మరింత బలహీన పరిచే చర్యలకు పూనుకోవడం, దీనికి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చర్చనీయాంశమైంది.

నాలుగేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 25 మంది కౌన్సిలర్లకు గాను వైసిపి మద్దతుదార్లు 23 మంది, తెలుగుదేశం ఒకరు, ఇండిపెండెంట్ ఒకరు ఎన్నికయ్యారు. వైసిపి అధిష్టానం సూచనతో అప్పట్లో ఒక అవగాహనతో రమాకుమారి చైర్‌పర్సన్ అయ్యారు. వీరి మధ్య సఖ్యత లేకపోయినా కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు సహకరిస్తూ వచ్చారు. ఇటీవల చైర్‌పర్సన్ వైసిపిని వీడి బిజెపిలో చేరడంతో వైసిపి రాజకీయంగా బహిరంగ ప్రదర్శనకు దిగి 17 మంది కౌన్సిలర్లతో 'అవిశ్వాసం' ప్రకటించి నెగ్గలేకపోయింది. ఈ నేపథ్యంలో వైసిపిని మరింతగా దెబ్బతీయాలన్న ఏకైక లక్ష్యంతో మున్సిపల్ చైర్‌పర్సన్, కూటమి నేతలు వైసిపికి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు (1), ఆరెపు గుప్తా(2)లపై 16 మంది కౌన్సిలర్ల సంతకాలతో కలెక్టర్, ఆర్డీఓ, కమిషనర్లకు అవిశ్వాస నోటీసును శుక్రవారం అందించడంతో మళ్లీ రాజకీయ వేడి రాజుకుంది.

ఈ నేపథ్యంలో వైస్ చైర్మన్లపై అవిశ్వాస సమావేశ తేదీ నిర్ణయం ఖరారు కాకుండానే క్యాంపు రాజకీయలకు తెరలేపినట్లు తెలిసింది. గత చైర్‌పర్సన్‌పై 'అవిశ్వాసం' నెగ్గకుండా ఉండడానికి సమావేశానికి వైసిపి సభ్యులు డుమ్మా కొట్టిన విషయం విధితమే. అయితే ఇప్పుడు 'అవిశ్వాసం' నెగ్గాలంటే 17 మంది సభ్యులు హాజరు కావలసి ఉంది. సంతకాలు చేసిన వారు 16 మందే అయినప్పటికీ ఎక్స్‌అఫిసియో మెంబరు ఎమ్మెల్యే విజయకుమార్‌తో కలిసి 17 మందితో కోరం ఏర్పడుతుందని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అవిశ్వాస నోటీసులో సంతకాలు చేయని 9 మంది వైసిపికి మద్దతుగా ఉన్నారా? లేదా? అన్నది కూడా సస్పెన్స్‌గా ఉంది. వారిలో కొందరిని ప్రజాశక్తి ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఇదే సమయంలో వైస్ చైర్మన్లు తమ పదవులకు ముందస్తుగానే స్వచ్ఛందంగా రాజీనామే చేసే యోచనలో ఉన్నట్టు తెలిసింది.

వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

పిల్లలు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : పిల్లలు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో జవహర్ కమ్యూనిటీ హాల్‌లో అనకాపల్లి చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యాన జరుగుతున్న నాలుగో రోజు వేసవి విజ్ఞాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లల్లో శాస్త్రీయ దృక్పధాన్ని, ప్రత్యామ్నాయ ఆలోచన విధానాన్ని పెంపొందించడం కోసం ఇటువంటి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని చెప్పారు. ఇటువంటి శిబిరాలలో పిల్లల పాల్గొని తమ విజ్ఞానాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు. అనంతరం. అనకాపల్లి చిల్డ్రన్ క్లబ్ సభ్యురాలు కె.సుజాత పిల్లలకు దేశభక్తి గీతాలను నేర్పించారు. సైన్స్ టెంపర్మెంట్‌కి సంబంధించిన మ్యాజిక్ అంశాలపై ఎసిసి జిల్లా కన్వీనర్ ఉమామహేశ్వరరావు ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆళ్ల మహేశ్వరరావు, ఎ.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వారం రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఈ వర్షాలు ఒకవైపు చెరకు తదితర పంటలకు ఉపయోగకరంగా ఉండగా, పప్పు ధాన్యాల పంటల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు మూడు నాలుగు రోజులుగా వ్యవసాయ పనులు చేపడుతున్నారు. ట్రాక్టర్లతో దుక్కులు చేయిస్తున్నారు. వర్షం వల్ల భూమిపదును ఉండటంతో మినుము, పెసర, బొబ్బర తదితర విత్తనాలను చల్లుతున్నారు. ట్రాక్టర్ల యజమానులు దుక్కులు చేయడంలో బిజీగా ఉన్నారు.

బాలికపై వీధి కుక్క దాడి

తీవ్రంగా గాయపడిన సింధు

ముక్కు భాగాన్ని కొరికేసిన కుక్క

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం పంచాయతీ శివారు చంద్రయ్యపేట గ్రామంలో కక్కల గగన సింధు (7) అనే బాలికపై వీధి కుక్క శనివారం దాడి చేసింది. దీంతో ఆమె ముక్కు తీవ్రంగా గాయపడింది. సింధు ఇంటి బయట ఆడుకుంటున్న సమయంలో అనూహ్యంగా వీధి కుక్క దాడి చేసి ముక్కుపై కరిచి ముక్కు పట్టుకెళ్ళిపోయింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబీకులు హుటాహుటిన కె.కోటపాడు సిహెచ్‌సికి తరలించగా, అక్కడి వైద్యులు విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. సర్జరీ చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. గగన సింధు కాశీపురం లోటస్ స్కూల్లో రెండో తరగతి చదువుతోంది. తండ్రి శ్రీను లారీ డ్రైవర్ కాగా, తల్లి గణపతి గృహిణి. ఆపరేషన్‌కు సుమారు రూ.50 వేలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులుగా చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

13వ రోజుకు సిహెచ్‌ఓల సమ్మె

అమర జవాన్ మురళీనాయక్‌కు నివాళి

అమర జవాన్ మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తున్న సిహెచ్‌ఓలు

ప్రజాశక్తి-అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 13వ రోజుకు చేరింది. నేషనల్ హెల్త్ మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న విషయం విధితమే. ఈ సందర్భంగా సిహెచ్‌ఓలు మాట్లాడుతూ 13 రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమ్మెను తప్పు దోవ పట్టించాలని ప్రయత్నాలు జరిగినా తాము లొంగేది లేదని స్పష్టం చేశారు. నిబంధన ప్రకారం ఆరు సంవత్సరాలు దాటిన వారిని క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని, ప్రతి ఏటా 5శాతం ఇంక్రిమెంట్, పని ఆధారిత ప్రోత్సాహకాలు, ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలని కోరారు. నిరసన శిబిరంలో పాక్ సరిహద్దుల్లో వీరమరణం పొందిన అమర జవాన్ మురళి నాయక్‌కు మౌనం పాటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓలు జి.భవాని, లలిత, జి యమునా, కె అశ్విని, టి కళ్యాణి, ఆర్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

అమర జవాన్‌కు జర్నలిస్టుల నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

సరిహద్దుల్లో పాక్ చేసిన దాడుల్లో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళి నాయక్‌కు అనకాపల్లి జర్నలిస్టులు ఘనంగా నివాళులర్పించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ సత్యనారాయణ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఆర్‌వి గోపాల్, పెంటకోట సత్యనారాయణ, మధుబాబు, అప్పారావు, స్వామి, రమేష్, సాయిరాం, ఆర్‌ఎంపిల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆడారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు లా విద్యార్థుల సంఘీభావం

సబ్బవరం : ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న భారత సైన్యానికి స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు శనివారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు ఆధ్వర్యాన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అకాడమిక్ బ్లాక్ ప్రధాన ద్వారం దగ్గర చేరుకొని సంఘీభావ కార్యక్రమం చేపట్టారు. భారత ప్రభుత్వం వెనుక మేము ఉన్నామని నిలబడాల్సి ఉందని విసి చెప్పారు.

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం తెలుపుతున్న లా విద్యార్థులు

యంత్రాలతో వరి కోతలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది కస్బా పొలాలలో రైతులు రబీ సీజన్లో భాగంగా వేసిన వరి పంటను హార్వెస్టింగ్ మిషన్‌తో కోతలు కోయిస్తున్నారు. వరి పంటను కోసిన వెంటనే పనల నుండి గింజలను వేరు గాను, గడ్డిని వేరుగా ఈ యంత్రం చేస్తుంది. గంటకు రెండు మూడు ఎకరాలకు పైగానే వరి పంటను కోస్తుండడంతో రైతులు ఈ యంత్రం ద్వారా వరి కోతలను కోయిస్తున్నారు. వరి పంటను ప్రత్యేకంగా నూర్పే అవకాశం లేకుండానే గింజలు వేరు చేసే కుప్పలుగా పోస్తుండడంతో రైతుల యంత్రం ద్వారా కోతలకు ఆసక్తి చూపిస్తున్నారు

యంత్రంతో వరి కోత కోస్తున్న దృశ్యం

విద్యుదాఘాతానికి 23 గొర్రెలు మృత్యువాత

మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చోడవరం, చోడవరం రూరల్

మండలంలోని గంధవరంలో కరెంటు షాక్‌కు గురై దేవర నారాయణకు చెందిన 23 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన గొర్రెల పెంపకందారుడు దేవర నారాయణ గొర్రెలు షెడ్ దగ్గర కరెంటు స్తంభం ఆనుకొని వేసిన ఇనుప కంచెకు స్తంభం ద్వారా కరెంటు పాస్ అయింది. ఈ ఇనుప కంచెను గొర్రెలు తాకడంతో 23 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.4.30 లక్షలు నష్టం వాటిల్లింది. దీంతో బాధితుడు నారాయణ కన్నీరుమున్నీరుగా విలపించాడు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితునికి నష్టపరిహారం అందివ్వాలని విద్యుత్, ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి విద్యుత్‌శాఖ నర్సీపట్నం డిఈ, చోడవరం ఏఈ సందర్శించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. స్థానిక పశు వైద్యాధికారి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ అధ్యక్షులు పల్లా నర్సింగరావు, మాజీ సర్పంచులు మొల్లి రామకృష్ణ, పల్ల అర్జున, మొల్లి అప్పలనాయుడు, పల్లా అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

లేటరైట్‌కు ఇచ్చిన లీజులు రద్దు చేయాలి

ఎపి వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

నాతవరం మండలం సరుగుడు ప్రాంతంలో లేటరైట్ తవ్వకాలకు మంజూరు చేసిన అన్ని లీజ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ అదికారంలోకి వచ్చిన తరువాత శరవేగంగా అడ్డగోలుగా లేటరైట్ తవ్వకాలు చేపాడుతున్నారని తెలిపారు. గతంలో కోయ్యూరు మండలం కాకరపాడుకు చెందిన జర్తా లక్ష్మణరావుకు 121 ఎకారాల్లో తవ్వకాలకు అనుమతి ఇవ్వగా గిరిజనులు ముక్త కంఠంతో వ్యతిరేకించారని, జర్తా లక్ష్మణరావు గిరిజనుడు కాదని, అప్పట్లో రుజువైందని పేర్కొన్నారు. అనుమతులకు అవసరమైన గ్రామసభ, పీసా కమిటీ అనుమతి, అటవీ హక్కులు చట్టం, 1/70 చట్టం వంటి వాటిని ప్రభుత్వం పూర్తిగా తుంగలో తోక్కిపెట్టిందని, ప్రస్తుతం 296,34.హెక్టార్లులో మైనింగ్ వ్యాపారులు తవ్వకాలు చేస్తున్నారని తెలిపారు. లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తున్న గిరిజనులను ప్రలోభ పెట్టేందుకు లీజుదారునికి వెనుక ఉన్న నర్సీపట్నానికి చెందిన మైనింగ్ వ్యాపారి డబ్బులు ఇస్తున్నారని తెలిపారు. గిరిజనులను చీల్చి లేటరైట్ తవ్వకాలకు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. లేటరైట్ లాభం రుచి మరిగిన వ్యాపారులు ఇంకొంతమంది గిరిజనులతో దరఖాస్తులు చేయిస్తున్నారని, వాటికి అనుమతులు లభిస్తే వేలాది ఎకరాల్లో అన్ సర్వే భూములు, కొండలు పెద్దపెద్ద లోయలుగా మారిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ మాఫియా లాభాలకు గిరిజనుల జీవితాలను ఫణంగా పెట్టి, గిరిజన చట్టాలను ఉల్లంఘించి మంజూరు చేసిన అన్ని లీజులను రద్దు చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

పాల ధర పెంపు అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ డెయిరీ యాజమాన్యం వినియోగదారులకు పాల ధర పెంచడం అన్యాయమని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు ఆవు పాల ధరను గతంలో తగ్గించిన యాజమాన్యం, వినియోగదారునికి విక్రయించే లీటరు పాలపై రూ. 2 పెంచడం దుర్మార్గమన్నారు. పెంచిన పాల ధరను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. గతేడాది పాల ధర పెంపును వ్యతిరేకించిన టీడీపీ, జనసేన, బీజేపీలు తక్షణమే జోక్యం చేసుకొని ధర తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. నిత్యావసర సరుకుల పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని పెంచిన పాల ధర తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మామిడిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

మామిడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు శనివారం మండలంలోని పి.భీమవరం గ్రామంలో మామిడి రైతులకు అవగాహన కల్పించారు. క్రమమైన పద్ధతిలో కాయలను బేగింగ్ చేయడం వలన పండు ఈగ ఉధృతి తగ్గుతుందని, తద్వారా మేలు రకమైన పండ్లు వస్తాయని చెప్పారు. బ్యాగ్గింగ్‌పై రైతులకు వివరించారు కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు హేమలత, మమతా హరిప్రియ ప్రశాంతి ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌సి సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఎస్సీ సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధరించి అమలు చేయాలని మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైవాడ అతిథి గృహం వద్ద శనివారం సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 28 రకాల ఎస్సీ సంక్షేమ పథకాలను కనుమరుగు చేసిందన్నారు. తమ ప్రభుత్వం వస్తే వాటిని పునరుద్ధరించి అమలు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీను కూటమి ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత కాలనీల అభివద్ధి కోసం సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సంఘ సభ్యులు సబ్బవరపు దేముడు, తాడి అప్పారావు, తెరపల్లి శ్రీరామ్, తాడి ఎర్నిబాబు, సబ్బవరపు కొండలరావు, మల్లవరపు దేముడు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించరూ..

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఈ.చౌడవాడ (కన్నూరుపాలెం) గ్రామంలో తీడ వెళ్లి రోడ్డులో చెత్త కుప్ప పేరుకుపోయింది. దీంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో గ్రామస్తులు, వాహనం దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ చుట్టూ పక్కన వేసి చెత్త పేరుకు పోయింది. తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాలని ప్రభుత్వం చెబుతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పారిశుధ్యంపై దృష్టి సాధించాలని, చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు

పెద్ద మొత్తంలో పేరుకుపోయిన చెత్త

పోలీసు వ్యవస్థపై అవగాహనా సదస్సు

మాట్లాడుతున్న పరవాడ డిఎస్‌పి విష్ణు స్వరూప్

ప్రజాశక్తి-పరవాడ : పోలీస్ వ్యవస్థపై ప్రజలలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు, నేరాల నివారణకు పరవాడ సంతబయలు వద్ద శుక్రవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పరవాడ డిఎస్‌పి విష్ణు స్వరూప్ మాట్లాడుతూ గ్రామంలో వస్తున్న అపరిచితులపై నిఘా పెట్టి, వారి వివరాలు తీసుకోవాలని, అద్దెకు ఇల్లు ఇచ్చే ముందు వారి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించించారు. వ్యాపారులు, ఇంటి యజమానులు తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలు బెట్టింగ్ యాప్స్ ప్రభావానికి గురికాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసలు కాకుండా చూడాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా అపరిచితుల ఫోన్లు, ఓటిపి మోసాల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా నాలుగు ముఖ్య కూడళ్లలో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్‌ఐ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి ఆర్.మురళీధర్ పట్నాయక్, వార్డు సభ్యులు పోతల అప్పలనాయుడు, పైల అప్పలనాయుడు, సత్యవేణి, గ్రామ పెద్దలు రెడ్డి శ్రీనివాస్, పైల రామచంద్రరావు, వర్తక సంఘ సభ్యులు, వ్యాపారులు, 150 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంగీత శిక్షణ ఇస్తున్న ఇంద్రగంటి శ్రీనివాస్

సంగీత శిక్షణకు స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి : 'కళ్యాణి అకాడమి ఆఫ్ ఆర్ట్స్' ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా సంగీత శిక్షణఖు మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా సంగీతం, కూచిపూడి నాట్యం, వెస్ట్రన్ డాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, కీబోర్డ్, గిటార్లలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణా తరగతులకు దాదాపు 160 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు అకాడమి కరస్పాండెంట్ ఇంద్రగంటి లక్ష్మి శ్రీనివాస్ తెలిపారు. జూన్ 10వ తేదీన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో వీరందరికీ సర్టిఫికెట్స్ అందిస్తామని తెలిపారు.

బాధిత పంచాయతీ కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ప్రమాదంలో కాలు విరిగి నెల రోజులుగా మంచంపై ఉన్న పంచాయతీ పారిశుధ్య కార్మికునికి తోటి కార్మికులు సహాయాన్ని అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. పోలేపల్లి గ్రామానికి చెందిన సీత ఈశ్వరరావు పది సంవత్సరాల నుంచి పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు నెలరోజుల క్రితం కాలు విరిగిపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. విషయాన్ని తెలుసుకున్న మండలంలోని పలు పంచాయతీల కార్మికులు తమకు తోచినంత విరాళం రూపంలో సమాకుర్చి శనివారం సిఐటియు నాయకులు ఎస్వీ నాయుడు ఆధ్వర్యంలో రూ.3000 అందజేశారు. ఈ సందర్భంగా ఎస్వీ నాయుడు మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన కార్మికులను అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాధిత కార్మికునికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు యేసు రాజు, ముత్యాలు, శ్రీను, రాజబాబు, మరియమ్మ, అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న సిఐటియు నాయకులు

వేసవికి 'చలువ' పుచ్చకాయలు

ప్రజాశక్తి-సబ్బవరం

వ్యాపారి దొరబాబు

ఎండలో దాహార్తిని తీర్చుకోవాలంటే మొదటిగా మనం ఎర్రని పుచ్చకాయలకే (వాటర్ మిలాన్) ప్రాధాన్యత ఇస్తాం. అన్ని సీజన్లలోనూ ఇవి దొరుకుతున్నా వేసవి కాలంలో లభ్యమయ్యే వాటి నాణ్యత, రుచే వేరు. నీటి శాతం అధికంగా ఉండడంతో పాటు బి విటమిన్లు, పొటాషియం పుష్కలంగా ఉండే పుచ్చకాయ తినడం వల్ల శరీరానికి వెంటనే శక్తి వస్తుంది. వడదెబ్బ బారినపడి శరీరం నిస్తేజం అయిపోకుండా కాపాడుతుంది. వేడికి కమిలిన చర్మానికి చల్లని పుచ్చకాయ గుజ్జును రాస్తే తిరిగి చర్మం నిగారింపు సంతరించుకుంటుంది. వేసవిలో కర్బూజా, చలువు కీరాదోస, చెరుకు రసం వంటివితో పాటు పుచ్చకాయలు వేసవిలో దాహార్తిని తీర్చడానికి, నిస్తేజాన్ని పోగొట్టడానికి ఎంతో ఉపయోగపడతాయి.

20 ఏళ్లగా వ్యాపారం చేస్తున్నాం

మండల కేంద్రంలోని చలువ పుచ్చకాయల వ్యాపారి చీకట్ల దొరబాబుతో ప్రజాశక్తితో మాట్లాడగా.... తాము కోనసీమ జిల్లా కోరిమిల్లి నుండి సబ్బవరంలో దాదాపు 20 ఏళు ్లగా ఈ సీజన్లో చలువ పుచ్చకాయల వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. తాము జనవరి నుండి మే వరకు ఏలూరు నుండి చలువ పుచ్చకాయలను లారీలతో తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ సీజన్లో సబ్బవరం, పెందుర్తి, కొత్తవలస ప్రాంతాల్లో వారానికి 20 టన్నులు చలువ పుచ్చకాయలు విక్రయిస్తున్నట్లు దొరబాబు తెలిపారు.

అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పుచ్చకాయలు

అంధునికి సహాయం

ప్రజాశక్తి-చోడవరం రూరల్

పుట్టుకతోనే రెండు కళ్ళు కోల్పోయిన అంధునికి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సహాయం అందించారు. మండలంలోని వెంకన్నపాలెం గ్రామానికి చెందిన హనుమంతరావుకు పుట్టికతోనే రెండు కళ్లు పోయాయి. ఎంతో పేదరికంలో జీవిస్తున్న హనుమంతరావుకు అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోవింద శనివారం 10కేజీల బియ్యం, కూరగాయలు, రేషన్ సరుకులు, ఖర్చులు నిమిత్తం కొంత డబ్బు అందజేశారు. ఇలాంటి వారికి సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు గోవింద తెలిపారు.

సహాయం అందిస్తున్న టీచర్

డిఎస్‌సికి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో అర్హతగల బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఇబిసి విద్యార్థులకు మెగా డిఎస్‌సి పరీక్ష కోసం ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ త్వరలో నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారిణి కె.రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల, అర్హులైన బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఈబీసీ అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి, అభ్యర్థులు తమ సొంత జిల్లాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టెట్ అర్హత సర్టిఫికెట్ జత చేసి అనకాపల్లి వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. దరఖాస్తుకు చివరి తేదీ, కోచింగ్ ప్రారంభించు తేదీ, కోచింగ్ వ్యవధి, ఇతర వివరాలను త్వరలో తెలియజేస్తామన్నారు. ఇతర వివరాలకు 9885845743, 9494978777 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

అచ్యుతాపురంలో కూలీలతో మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మిక హక్కుల రక్షణకు ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దామని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. శనివారం స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ అధ్యక్షతన జరిగిన యూనియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో అయోధ్యరామ్ మాట్లాడుతూ గత నెలలో రూ.72 కోట్ల నికరలాభంతో ప్లాంట్ ఆర్థిక పరిస్థితి బాగున్నా కార్మికులకు పూర్తి జీతాలు చెల్లిస్తామని, హెచ్‌ఆర్‌ఎ పునరుద్ధరిస్తామని, కరెంటు చార్జీలు తగ్గిస్తామని మాటిచ్చిన యాజమాన్యం నేడు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. లేబర్ కోడ్స్ అమలులోకి రాకమునుపే కార్మికుల పట్ల యాజమాన్యాల వైఖరి ఇలా ఉంటే, అవి అమల్లోకి వస్తే పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులపై దాడిని కార్మికులకు వివరించి సమ్మెకు సన్నద్ధం చేయడం ప్రతి స్టీల్ సిఐటియు కార్యకర్త మొదటి ప్రాధాన్యతగా తీసుకొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ పూర్తి ముడిసరుకు సమకూర్చిన తరువాతే బ్లాస్ట్ ఫర్నేస్-3ని ప్రారంభిస్తానని స్టీల్‌ప్లాంట్ సందర్శనకు వచ్చినప్పుడు స్టీల్ కార్యదర్శి చెప్పారని, ప్రస్తుతం జూన్ నెలాఖరు వరకు సరిపడే రా మెటీరియల్ ఉన్నా చర్యలు చేపట్టడం లేదన్నారు. ప్లాంట్‌లో మానవ వనరుల కొరత వల్ల పని ప్రదేశంలో భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సమావేశంలో నాయకులు పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, టి వి కె రాజు, మరిడయ్య, బి మహేష్, దేముడు నాయుడు, డిఎస్‌ఆర్‌సి మూర్తి, లోకేష్, కె సత్యనారాయణ, మహేష్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీరామ చంద్రమూర్తి, సిహెచ్ వెంకట్రావు, బొంజు బాబు, డి సత్యనారాయణ, వి ప్రసాద్, దుర్గాప్రసాద్, కృష్ణమూర్తి, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామస్వామి

20న ఆటోల బంద్

విశాఖ కలెక్టరేట్ : కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా ఆ రోజు ఆటోలను బంద్ చేయనున్నట్టు విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) అధ్యక్షులు పి.రాజ్ కుమార్ తెలిపారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు కోసం, జిఒ 21 ఉపసంహరణ కోసం, పెంచిన త్రైమాసిక, ఆర్‌డిఒ చలానా చార్జీల తగ్గింపు కోసం ఈ బంద్‌లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి అనుబంధ ఆటో కార్మిక సంఘాలన్నీ బంద్‌లో పాల్గొన్నట్టు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా నాయకులు రెడ్డి, కెవి.రమణ పాల్గొన్నారు.

రావికమతం: అసంఘటిత కార్మికులు, స్కీం వర్కర్స్, సమస్యలు పరిష్కారానికి ఈనెల 20 తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. మండల కేంద్రంలో సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వజ్రపు సత్యవతి అధ్యక్షతన పలు ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు. కరణం రమణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు శేషు బాబు, అంగన్వాడి, ఆశ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ, స్కీం వర్కర్స్‌కి కనీసం రూ.26000 వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను విరమించుకోవాలని, సమానం పనికి సమాన వేతనం ఇవ్వాలని, స్కీమ్ వర్కర్‌లుగా పనిచేసే వారినీ కార్మికులుగా గుర్తించాలన్నారు. ముఠా కార్మికులకు సమగ్రమైన చట్టం అందుబాటులోకి తీసుకురావాలని ఆమె తెలిపారు. రైతాంగం పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 20న చేపడుతున్న సమ్మెను జయప్రదం చేయాలని సదస్సులో తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విశాఖలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

పరవాడ : 20న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలో ఫార్మా సిటీలో శనివారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే రమణ, జి చిట్టిబాబు, సత్తిబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతు జరుగుతున్న సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం కసింకోటలో సిఐటియు, ప్రజా సంఘాలు నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, తనూజ, రమాదేవి, నాగమణి, నారాయణమ్మ, సత్యవతి, అమ్మాజీ, లక్ష్మి, నూకరత్నం పాల్గొన్నారు.

అచ్యుతాపురం : 20న జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలోఉపాధి కూలీలు భాగస్వాములు కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, కౌలు రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షులు కె.రామ సదాశివరావు పిలుపునిచ్చారు. మండలంలోని నరేంద్రపురం, ఉప్పవరము గ్రామాలలో పనిచేస్తున్న ఉపాధి కూలీల దగ్గరకు వెళ్లి సమ్మె ప్రాధాన్యతను వారికి వివరించారు.

పరవాడలో...

రావికమతంలో..

శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -నక్కపల్లి: 3వ ఆంధ్రా ఎన్.సి.సి బాలికల బెటాలియన్ వార్షిక శిక్షణా శిబిరంలో నిర్వహించిన పోటీలో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ కనబరిచినట్లు పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. సూరంపాలెంలో ఈ నెల 1 నుండి 10వ తేదీ వరకు జరిగిన 3వ ఆంధ్రా ఎన్.సి.సి బాలికల బెటాలియన్ జూనియర్, సీనియర్ ఉమ్మడి వార్షిక శిక్షణా శిబిరం-1లో నిర్వహించిన వివిధ పోటీలలో శ్రీప్రకాష్ విద్యానికేతన్‌కు చెందిన జూనియర్ వింగ్ ఎన్.సి.సి కాడెట్లు, శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ క్యాడెట్లు తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. ఈ శిబిరానికి 8 జూనియర్, 5 సీనియర్ వింగ్‌లకు చెందిన మొత్తం 456 మంది క్యాడెట్లు హాజరయ్యారన్నారు. ఈ శిక్షణా శిబిరంలో నిర్వహించిన 11రకాల పోటిలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు జూనియర్ వింగ్ విభాగంలో సోలో సాంగ్ పోటీలో మొదటి స్థానం, ఖో- ఖో, చెస్ పోటీలలో రెండవ స్థానంలో నిలిచి 1 బంగారు పతకం, 10 వెండి పతకాలను, సీనియర్ విభాగంలో బాడ్మింటన్‌లో మొదటి స్థానం,గ్రూప్ సాంగ్, ఖో-ఖోలో ద్వితీయ స్థానం సాధించి 1 బంగారు పతకం, 13 వెండి పతకాలను సాధించినట్లు వెల్లడించారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ హెచ్.ఎస్.మానిక్, గ్రూప్ కమాండర్ రితిన్ మోహన్ అగర్వాల్ ఎస్.ఎం.గులాబ్ సింగ్ చేతుల మీదుగా ఈ పతకాలను అందుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు

విద్యార్థిని పరామర్శిస్తున్న సంస్థ సభ్యులు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న
విద్యార్థికి రూ. 15 వేల ఆర్థిక సాయం
- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కొత్తకోట:తీవ్ర అనారోగ్యంతో విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి సియాద్రి మణికంఠకు కొత్తకోటకు చెందిన గ్రౌండ్ బోయ్స్ సేవా సంఘం సభ్యులు రూ.15 వేల నగదు సాయం అందజేశారు. శనివారం ప్రజాశక్తిలో వచ్చిన వార్త కు స్పందించిన సంఘం సభ్యులు ఆసుపత్రి లో శికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించి కుటుంబ సభ్యలకు సాయం అందించారు. రావికమతం మండలం కన్నంపేట గ్రామానికి చెందిన విద్యార్థి మణికంఠ గత వారం రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై విశాఖ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరిన సంగతిని ప్రజాశక్తిలో ప్రచురణ కావడం తో ఆ సంఘం యువకులు స్పందించారు. తక్షణ సాయంగా విద్యార్థి కుటుంబానికి నగదు సాయం చేయడంతో పాటు విద్యార్థికి కావాల్సిన రక్తం సిద్ధం చేసారు. విద్యార్థి త్వరగా కోలుకునేందుకు తమ వంతు సహకారం అందజేస్తామని గ్రౌండ్ బోయ్స్ సేవా సంఘం సభ్యులు శేషు తదితరులు పేర్కొన్నారు.

అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

నక్కపల్లిలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహెూత్సవాల సందర్భంగా శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

చెంగలను సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

గూడుపమ్మను దర్శించుకున్న చెంగల

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రేబాకలో గూడుపమ్మ అమ్మవారిని శనివారం మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు దర్శించుకున్నారు. అమ్మవారికి చెంగల వెంకట్రావు, కుటుంబ సభ్యులు, బంధువులు పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసారు. గ్రామ సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు, సాదిరెడ్డి నారాయణ మూర్తి, వెల్లంకి కాసుబాబు, ఉప సర్పంచ్ సీహెచ్ శ్రీను తదితరులు చెంగలను అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి, చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో రామునాయుడు, తోట నూకరాజు, దాసరి నాగేష్, చెవ్వాకుల తాతబాబు, గోవిందరాజులు, నారయ్య ,నానాజీ పాల్గొన్నారు.

నేటి నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు

- ముస్తాబైన ఆలయం - పట్టణంలో విద్యుద్దీపాలంకరణ

ప్రజాశక్తి-పాడేరు: మన్య ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారి జాతర మహెూత్సవాలు పాడేరు పట్టణంలో ఈనెల 11వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాల సందర్భంగా పాడేరులోని అమ్మవారి దేవాలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు ఆలయం లోపల అమ్మవారి మూల విరాట్ విగ్రహాన్ని పువ్వులతో అందంగా అలంకరించారు. కొండమ్మ అమ్మవారిని కొలువు తీర్చేందుకు పట్టణంలోని మెయిన్ రోడ్ ప్రాంగణంలో శతకంపట్టు ఏర్పాటు చేశారు. ఆదివారం వేకువజామున అమ్మవారి ఆలయం నుంచి కొలువుత్సవాన్ని నిర్వహించి అమ్మవారి పాదాలు ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించి శతకం పట్టులో ప్రతిష్ఠించనున్నారు. భక్తులు ఊరేగించేందుకు 100 ఘటాలను సిద్ధం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఆలయ కమిటీ/ ఉత్సవ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో మూడు రోజులు మోదకొండ అమ్మవారి ఉత్సవాలను నిర్వహించేందుకు పట్టణంలో పలు ఏర్పాట్లు చేశారు. పట్నంలోని మూడు రోడ్ల అంబేద్కర్ కూడలి నుంచి మూడు వైపులా ప్రధాన రహదారులకు విద్యుత్ దీపాల అలంకరణ చేశారు. ఉత్సవాల మూడు రోజులు వీక్షించేందుకు వినోదాత్మక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, ప్రతి ఏటా నిర్వహించే విధంగానే ఈసారి మోదకొండ మహెూత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఈనెల 11, 12, 13 తేదీలలో పాడేరు లో జరిగే మోద కొండమ్మ అమ్మవారి జాతర సందర్భముగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి అమిత్ బర్గర్ పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేశారు. భద్రత చర్యలు లో బాగంగా డ్రోన్‌లు, సీసీ కామెరాలు, శక్తి టీంలు డాగ్ స్క్వాడ్‌లతో పర్యవేక్షణ చేస్తున్నారు.

విద్యుత్ దీపాల వెలుగుల్లో మెరిసిపోతున్న ఆలయం

వాహనాలు మళ్లింపు

మోదకొండమ్మ ఉత్సవం జరిగే మూడు రోజులలో భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ మళ్లించారు. అరుకు, హుకుంపేట, పెదబయలు, ముంచింగుపుట్టు నుండి చోడవరం వైపు వెళ్లు వాహనములు ఆడారిమెట్ట మీదుగా సన్యాసంపల్లి మీదుగా వంతాడపల్లి చెక్పోస్ట్ మీదుగా మళ్ళించారుచోడవరం, వైజాగ్ నుంచి వచ్చే వాహనాలు అరకు గానీ హుకుంపేట, ముంచంగిపుట్టు, పెదబయలు వెళ్ళవలసిన వారు ఎంపీడీవో ఆఫీస్ పక్క నుండి డిగ్రీ కాలేజ్, సినిమా హాల్ సెంటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు మళ్లించారు.జి.మాడుగుల నుండి అరుకు వెళ్ళవలసిన వాహనాలు సెయింట్ ఆన్స్ జంక్షన్ దగ్గర కుడివైపు తీసుకుని నక్కల పుట్టు మీదుగా ఎంపీడీవో ఆఫీస్ పక్క నుండి డిగ్రీ కాలేజ్, సినిమా హాల్ సెంటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు మళ్లించారు.అరకు నుండి జిమాడుగుల వైపు వెళ్ళవలసిన వారు ఆడారి మెట్ట మీదుగా సన్యాసంపల్లి మీదుగా వంతాడపల్లి చెక్పోస్ట్ ప్రక్కనుండి నక్కల పుట్టు మీదుగా లగిసిపల్లి నుండి సెయింట్ ఆన్స్ కు వచ్చి జిమాడుగుల వైపు మళ్లించారు.పెద్ద వాహనాలకు ఈ మూడు రోజులు ఘాట్ రోడ్లోకి, పాడేరు టౌన్‌లోకి అనుమతి నిలుపుదల చేశారు.



మాట్లాడుతున్న వైద్యులు

హార్ట్, లంగ్ ఫెయిల్యూర్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల రోగులకు ఆధునిక మార్గదర్శక హృదయ, ఊపిరితిత్తుల రోగ నివారణ సేవలను అందించడానికి విశాఖపట్నం ఎంజిఎం హెల్త్‌కేర్ సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో హార్ట్,లంగ్ ఫెయిల్యూర్ క్లినిక్‌ను శనివారం ప్రారంభించారు. డాక్టర్ ప్రశాంత్ రాజగోపాలన్, డాక్టర్ ఉర్జితా రాజగోపాలన్ నాయకత్వంలో, చెన్నై నుంచి వచ్చిన అనుభవజ్ఞులైన వైద్యుల బృందం సహకారంతో ఏర్పాటు చేశారు.ట్రాన్స్‌ప్లాంట్ అవసరం వచ్చే దశకు ముందే హృదయ, ఊపిరితిత్తుల సమస్యలను గుర్తించి చికిత్స చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు, వైద్యులు కె.ఆర్. బాలకృష్ణన్ తెలిపారు. ఎంజిఎం ఆసియాలో అతిపెద్ద హార్ట్,లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ నిర్వహిస్తోందని, ఇప్పటివరకు 750 కి పైగా విజయవంతమైన శస్త్రచికిత్సలు జరిగినాయని తెలిపారు. విశాఖపట్నంలో ఈ క్లినిక్ ప్రారంభించడానికి కారణం రోగులు మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గించడ మేనన్నారు. మెడికల్ మేనేజ్‌మెంట్‌తో పాటు, ట్రాన్స్‌ప్లాంట్ అవసరమైన రోగులకు భవిష్యత్తులో స్థానికంగా చికిత్స అందించనున్నారన్నారు.డాక్టర్ రమణ కుమార్ మాట్లాడుతూ, ఇది ప్రాంతీయ ఆరోగ్య సంరక్షణలో ఒక కొత్త యుగం అన్నారు. "ప్రపంచ స్థాయిలో ఫలితాలు అందించగల ట్రాన్స్‌ప్లాంట్ సేవలను తాము ఇక్కడ కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెవెన్ హిల్స్, ఎంజీఎం హాస్పటల్ సిఈవో వింగ్ కమాండర్ ఎం.కె బోస్, వైద్యులు కె.ఆర్. బాలకృష్ణన్, సురేష్‌రావు, సోమిత్రి రాయ్, రమణ కుమార్, సందీప్ కుమార్ లెంకా(జిఎం మార్కెటింగ్, ఎంజిఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్), రమేశ్ యండాడ తదితరులు పాల్గొన్నారు.

మాతృమూర్తి కళారూపం

అద్భుతం.. మాతృమూర్తి కళారూపం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి తన సూక్ష్మ కళతో మాతృమూర్తికి వందనాలు సమర్పించాడు. ఆదివారం మాతృ దినోత్సవం పురస్కరించుకొని చెక్కతో తల్లి బిడ్డ ప్రతిరూపాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఈ అద్భుత కళారూపాన్ని చెక్కిన రవి పలువురు అభినందించారు.

జాతీయ రక్షణ నిధికి స్పీకర్ అయ్యన్న విరాళం

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్: స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన ఒక నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా అందజేశారు. ఆన్లైన్ పేమెంట్ ద్వారా 2 లక్షల విరాళాన్ని ఆయన జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మన దేశ సాయుధ దళాలు ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు చేస్తున్న ధైర్యసాహసాలు ప్రతి భారతీయునిలో స్ఫూర్తిని రగిలి స్తోందన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న వీర జవాన్లకు ఒక నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చానని తెలిపారు. ఉగ్రవాద నిర్మూలనలో సాయుధ దళాలు ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలు దేశ ప్రజలందరికీ గర్వకారణంగా నిలుస్తున్నాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొని యాడారు.

ఆర్‌టిసి డిపోలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు డిపో యాజమాన్యం చర్యలు చేపట్టాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. నర్సీపట్నం డిపో నుంచి హైదరాబాద్‌తో పాటు కాకినాడకు ఏర్పాటు చేసిన రెండో సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో నర్సీపట్నం నుండి హైదరాబాద్‌కు ప్రత్యేక సర్వీసు ప్రారంభించడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. అనంతరం ఆకస్మికంగా ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలను పరిశీలించారు. రోజూ వేలాది మంది ప్రయాణించే నర్సీపట్నం డిపోలో సౌకర్యాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, డిపో భవనాల రంగులు పాడవడం వంటి అంశాలపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి నెల డిపోకు అద్దె రూపేణా వచ్చే రూ.7.90 లక్షల ఆదాయాన్ని వినియోగించి ఈ పనులన్నీ తక్షణమే పూర్తి చేయాలని ఆయన సూచించారు. డిపో ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఇలాంటి సమస్యలపై సమీక్ష నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేష్ డిపో మేనేజర్ ధీరజ్, జిల్లా రవణాధికారి పద్మావతి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు

బస్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న

ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్లు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ: ఎండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ శనివారం ఎసి హెల్మెట్లు అందజేశారు. ప్రస్తుతం ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం దృష్ట్యా వీటిని సమకూర్చారు. కరమ్ సేఫ్టీ ప్రైవేట్ లిమిటెడ్ నోయిడా దాతల సహాయంతో 30 ఎసి హెల్మెట్లను కొనుగోలు చేసామని, వీటి విలువ రూ.6 లక్షలని తెలిపారు. ఇవి ఆక్టివ్ కూలింగ్ టెక్నాలజీ ద్వారా పనిచేస్తాయని అన్నారు.

కిట్లు అందజేస్తున్న పోలీస్ కమిషనర్

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ: మహావిశాఖ నగరాన్ని నిత్యం పరిశుభ్రపరచడంలో రాత్రి పారిశుధ్య కార్మికుల విధుల పనితీరును మెరుగుపరచడంలో జివిఎంసి ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలో ఆర్కే బీచ్, జగదాంబ జంక్షన్ పరిసరాల్లో రాత్రి సమయంలో పారిశు ధ్య పనులు పరిశీలించారు. ముందుగా ఆర్కే బీచ్ వద్ద ఉన్న పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేసి రోజూ పారిశుధ్య కార్మికులు ఎంతమంది వస్తారు, ఎన్ని గంటలకు హాజరై రోడ్డు, బీచ్ పరిసరాలు పరిశుభ్రం చేస్తున్నారని, కొంతమంది సెలవులలో ఎందుకు వెళ్తున్నారని ప్యాకేజీ నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌ను ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ వారికి సరఫరా చేసిన ఊడ్చే చీపురులను తనిఖీ చేసి నాణ్యత బాగు లేదని, వాటిని మార్చాలని, అలాగే ఇంకా ఎంత స్టాక్ చీపుర్లు ఉన్నాయో నివేదిక సమర్పించాలని, పారిశుధ్య కార్మికులకు అవసరమయ్యే పనిముట్లు, డస్ట్‌బిన్లు, తోపుడుబండ్లు సమకూర్చాలని సహాయ వైద్యాధికారి డాక్టర్ కష్ణంరాజును ఆదేశించారు. అనంతరం బీచ్ లో ఎక్కువగా వ్యర్థాలను గమనించిన మేయర్ దుకాణాల వద్దకు వెళ్లి డస్ట్ బిన్లలో పర్యాటకులు, సందర్శకులు వినియోగించిన వ్యర్థాలను వేసేటట్లు అవగాహన పరచాలని, ప్రతి దుకాణం దగ్గర డస్ట్‌బిన్ తప్పకుండా ఉండాలని దుకాణదారులకు అవగాహన కల్పించాలని, అలా సహకరించని వారి షాపులను తొలగించాలని ఆదేశించారు. సందర్శకులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకడ్రైవ్ చేపట్టాలని, అలాగే బీచ్‌లో ఉన్న టాయిలెట్లను నిత్యం పరిశుభ్రపరిచేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. స్నానపు గదులు కూడా ఉండేలా సందర్శకులకు, విహార యాత్రికులకు సౌకర్యాలను కల్పించాలని సహాయ వైద్యాధికారికి మేయర్ ఆదేశించారు.

మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు